క్లుప్తంగా

చెట్లను కొట్టేందుకు వేలం

కాకినాడ సిటీ: కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని సామర్లకోట ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ కేంద్రంలో 5.75 సెంట్ల విస్తీర్ణంలోని వివిధ చెట్లను వేర్లతో సహా కొట్టి తీసుకు వెళ్లేందుకు ఈనెల 19న శనివారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. కొబ్బరి, వేప, ఉసిరి, గానుగ, బొడ్డు మామిడి, మామిడి, సుబాబుల్, అడవిమల్లి, నేరేడు, టేకు, నక్కిడి, తొగర, నిద్రగన్నేరు, అశోక, మామిడి, రావి, దుర్శిని, యూకలిప్టస్, చింత, తెల్లమద్ది, జీడి మామిడి తదితర 427 చెట్లు ఉన్నాయన్నారు. వీటన్నింటినీ వేళ్లతో సహా తొలగించి తీసుకొని వెళ్లిపోయేందుకు శనివారం ఉదయం 11 గంటలకు సామర్లకోట పురపాలక సంఘ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు ఆర్డీవో సత్యనారాయణ తెలిపారు.

చిన్నారులకు పాలు పంపిణీ

కాకినాడ కల్చరల్: స్థానిక శాంతినగర్‌లోని శ్రీరామకృష్ణాసేవాసమితి సభ్యుల బుధవారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సమితి అధ్యక్షుడు వీఎస్ గాంధీ చేతుల మీదుగా దాత సహకారంతో ప్రతిరోజు 80 మంది చిన్నారులకు నిర్వహించే ఉచిత పాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత ఏడాది మంచి మార్కులతో ఉత్తీర్ణులైన పదో తరగతి విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. హిందీలో 96 మార్కుల సాధించిన విద్యార్థిని మనీషాకు నగదు బహుమతి, హిందీ నిఘంటువు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, పాఠశాల సిబ్బంది, తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మలేషియా సదస్సులో కాకినాడవాసి ‘శ్రీ శ్రేయన’



కాకినాడ: మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ యువజన సదస్సులో పాల్గొనే అరుదైన అవకాశం కాకినాడ వాసికి దక్కింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఎదురవుతున్న ఆర్థిక సంక్షోభాలు, యుద్ధాలు, ఆరోగ్య సమస్యలు, రాజకీయ ఒడిదుడుకులు తదితర అంశాలపై యువతలో అవగాహన కలిప్పించేందుకు ఈ సెమినార్ ఏర్పాటు చేశారు. ఏషియా యూత్ ఇంటర్నేషనల్ మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఏవైఐఎంయుఎన్) పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచంలోని 79 దేశాల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు హాజరు కాగా, భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 24 మంది పాల్గొన్నారు. అడ్రసింగ్ ది ఇంక్రీజ్ ఆఫ్ గ్లోబల్ ఎకనామిక్ డౌన్‌టర్న్ టూ అటైన్ పోస్ట్ పాండమిక్ స్టెబిలిటీ అనే అంశంపై ఆమె మాట్లాడింది. ఆమెకు సంస్థ నిర్వాహకులైన ఇంటర్నేషనల్ గ్లోబల్ నెట్వర్క్ ప్రాజెక్టు మేనేజర్ తియారా ఫిర్ దాస్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. శ్రీ శ్రేయన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ–నారాయణరావు కుమార్తె. ఎంపీ వంగా గీత, సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కురసాల కన్నబాబు శ్రీ శ్రేయనను అభినందించారు.

ఓటర్ల సర్వేకు సహకరించండి



ఓటర్ల జాబితా సర్వేపై మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ



ఓటర్ల సర్వేపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో నాగ నరసింహారావు

- ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాపై సర్వే జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 21వ తేదీ నాటికి సర్వే ముగిస్తుందని దీనికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఆర్డీవో ఎన్‌వీవీ సత్యనారాయణ కోరారు. బుధవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో ఓటర్ల జాబితా సర్వేపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం 6, 7, 8 లకు సంబంధించి మార్పులు, చేర్పులు, మరణించిన వారి విషయంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఎప్పటికప్పుడు సర్వే జాబితా రాజకీయ పార్టీ ప్రతినిధులకు క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులకు, రాజకీయ పార్టీల ఏజెంట్లకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబు, ఆకుల వెంకటరమణ, లీలావతి, రూరల్ తహసీల్దార్ మురార్జీ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ చైనులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ ఆధ్వర్యంలో సమీక్ష

కాకినాడ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటర్ల ఇంటింట సర్వే సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్, ఈఆర్వో సీహెచ్ నాగ నరసింహారావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఓటర్ల ఇంటింట సర్వేపై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. సర్వే జరుగుతున్న తీరును రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి, అభ్యంతరాలు, సూచనలు, సలహాలు స్వీకరించారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో తహసీల్దార్ సీతాపతిరావు, ఎంఎస్ఓ మురళీకృష్ణ, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, వైఎస్సార్ సీపీ ప్రతినిధి రావూరి వెంకటేశ్వరరావు, టీడీపీ ప్రతినిధులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, బహుజన సమాజ్ పార్టీ తరఫున ఎస్ అప్పారావు, ఆమ్ ఆద్మీ పార్టీతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే ద్వారంపూడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి తదతరులు

కాకినాడ కల్చరల్: ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక సూర్యకళామందిర్‌లో ది ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం 184 వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని వివిధ సంఘాలకు సంబంధించిన 40 అసోసియేషన్లకు భవన నిర్మాణాలకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఫొటోగ్రఫీలో మరింత రాణించాలని కొడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అన్నారు. కార్యక్రమానికి ముందు అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సర్పవరం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా జగన్నాథపురం వంతెన వరకు సాగింది. ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ ఎంతగానో కృషి చేస్తోందని జిల్లా అధ్యక్షుడు తోట సూర్య సుబ్బారావు అన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి సయ్యద్ కమ్రాజాం, కోశాధికారి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా సీనియర్స్ జట్టుతో సంఘ కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడ ఐడియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం రాత్రి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికను నిర్వహించారు. ఈ ఎంపికలను హ్యాండ్‌బాల్ సంఘ కార్యదర్శి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 16 మందితో కూడిన జట్టును రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ నెల 18 నుంచి 20 వరకు ప్రకాశం జిల్లా జరిగే పోటీలలో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. ఎంపికల నిర్వహణలో ఐడియల్ కళాశాల పీడీ ఫణికుమార్, ఎంఎస్ఎన్ కళాశాల పీడీ అజ్జిబాబు, హ్యాండ్‌బాల్ కోచ్ అనిల్, సుధాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

గంజాయి బ్యాచా..!

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో అత్యవసర విభాగం వద్ద బుధవారం అసాధారణ రీతిలో ప్రవర్తించిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత వివరాల్లోకి వెళితే బుధవారం సాయంత్రం ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని బంధువుల్లో కొందరు ఓ ఆటోలో జీజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడు వార్డులోకి ప్రవేశించగానే అక్కడే కాపలా ఉన్న భద్రతా సిబ్బంది ఎక్కువ మంది వార్డులోకి ప్రవేశించేందుకు అనుమతి లేదని చెబుతూ అడ్డుకున్నారు. ఇంతలో బంధవులమంటూ వచ్చిన వారిలో ఇద్దరు యువకులు అసాధారణంగా ప్రవర్తించారు. తలుపులను కాళ్లతో తంతూ, కేకలు వేయడం మొదలు పెట్టారు. తమని లోపలికి పంపాలంటూ రచ్చ చేశారు. నిలువరించడం సెక్యూరిటీ సిబ్బంది వల్ల కాలేదు. దీంతో వారు పక్కనే ఉన్న పోలీస్ అవుట్ పోస్టుకు సమాచారం ఇచ్చారు. ఇద్దరు పోలీసులు రాగా వారిపైనా ఈ ఇద్దరు యువకులు తిరగబడ్డారు. వారిని నిలువరించి తనిఖీలు చేస్తే ఇరువురి ప్యాంటు జేబుల్లో గంజాయి విక్రయించేందుకు లేదా వినియోగించేందుకు వాడే చిన్నపాటి పొచ్‌లను గుర్తించారు. అంతే కాకుండా ఓ యువకుడి జేబులో కత్తి కూడా లభ్యమైంది. దీంతో క్రైం పార్టీ జీజీహెచ్‌కు చేరుకుని యువకులిద్దర్నీ అదుపులోకి తీసుకుంది. గంజాయి విక్రయాలు, వినియోగం తరచు గుర్తిస్తున్న నేపథ్యంలో యువకులు ఇద్దరూ గంజాయి బ్యాచ్‌కు చెందిన వారా అనే కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది.

ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస

కాకినాడ రూరల్: ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస వర్ధంతిని సర్పవరం జంక్షన్‌లోని వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. విశ్రాంత హెచ్‌ఎం వి.వర్ధనమ్మ మాట్లాడుతూ రామకృష్ణ పరమహంస అన్ని మతాల సారాంశం ఒక్కటే నని బోధించేవారన్నారు. అడబాల రత్నప్రసాద్, డాక్టరు శీరిష, సత్యనారాయణ, చంద్రరావు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి నివాళి

మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వాకర్స్ జిల్లా కో ఆర్డినేటరు అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ ఆయన గొప్ప రాజనీతజ్ఞుడన్నారు. డాక్టరు శీరీష, చంద్రరావు పాల్గొన్నారు.



వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న ట్రస్ట్ సభ్యులు

పేదలకు దుస్తుల పంపిణీ

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు బుధవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఆధ్యాత్మికవేత్త డాక్టరు శీరిష, దాత శ్రీరామచంద్రమూర్తి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏఎస్‌డీ మహిళా కళాశాలలో జాబ్ డ్రైవ్

కాకినాడ సిటీ: కాకినాడ అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ అటానమస్ కళాశాలలో జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం కె7 టెక్నాలజీస్ సంస్థచే జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ వి.అనంతలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్‌లో 2020–23 విద్యా సంవత్సరాల మధ్య డిగ్రీ, పీజీ చదివి కంప్యూటర్ అనుభవం కలిగిన వారికి ఉద్యోగవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ డ్రైవ్‌కు హాజరయ్యే అభ్యర్థినులు తమ విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్, పాన్ కార్డులు, బ్యాంకు పాస్ పుస్తకం, నాలుగు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు.

మొక్కలు నాటి ఫలప్రదం చేయండి

- ఏఐసీసీ కాకినాడ శాఖ పిలుపు
- 19న ఎమ్మెల్యే ద్వారంపూడిచే ప్రారంభం

కాకినాడ రూరల్: పర్యావరణహితం కోరుతూ 19వ తేదీన కాకినాడ స్మార్ట్ సిటీలో 11 వేల ఫలసాయమిచ్చే మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ శాఖ పిలుపు ఇచ్చింది. రమణయ్యపేటలో బెరాకా బ్లెస్సింగ్ చర్చ్‌లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు సామాజిక కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం కౌన్సిల్ కాకినాడ శాఖ అధ్యక్షుడు రిక్కీ గూటమ్, కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్ ఆ వివరాలను విలేకరులకు తెలిపారు. కాకినాడ కేగ్ మెమోరియల్ చర్చి వద్ద ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి 19న ఉదయం మొక్కలు నాటుతారన్నారు. నగరంలో 400 ప్రాంతాల్లో మొక్కలు నాటనున్నట్టు తెలిపారు. జోసెఫ్ బెన్నీ, దైవ, పరిమి ఐజాక్, విస్సా విజయకుమార్, అంకిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రమణయ్యపేటలో జాన్ వెస్లీని సన్మానిస్తున్న ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా పెద్దలు

జాన్ వెస్లీకు సన్మానం

ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్‌వెస్లీని నగరంలోని క్రిస్టియన్లు బుధవారం సన్మానించారు. ఒకటో డివిజన్ రమణయ్యపేటలోని బెరాకా బ్లెస్సింగ్ చర్చ్‌లో సాగిన సన్మానం అనంతరం తనపై నమ్మకంతో సీఎం జగన్ ఈ పదవి ఇచ్చారని, ఆయన నమ్మకాన్ని నిలబెడతానని ఈ సందర్భంగా జాన్ వెస్లీ తెలిపారు.

డ్రైనేజీలలో చెత్త వేస్తే చర్యలు

- కమిషనర్ నాగ నరసింహారావు
- పారిశుధ్య పనుల ఆకస్మిక తనిఖీ



పారిశుద్ధ్య పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: డ్రైనేజీలలో చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు స్పష్టం చేశారు. స్థానిక జగన్నాథపురం 20వ డివిజన్ లోని ముత్తా నగర్, బాలయోగి విగ్రహం రోడ్డు ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలోని డ్రైనేజీలలో చెత్త వేయడాన్ని గుర్తించి స్థానికులను పిలిచి మాట్లాడారు. తూరంగి ప్రాంతానికి చెందిన ప్రజలు ఈ చెత్తను తీసుకువచ్చి డ్రైనేజీలలో వేస్తున్నట్లు గమనించారు. ఇకపై అలా చేయవద్దని, చెత్తను డ్రైనేజీలలో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై స్థానిక ప్రజలలో అవగాహన కల్పించాలని, చెత్తను డ్రైన్‌లో వేయకుండా నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని అక్కడి శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సెక్రటరీలను ఆదేశించారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణకు నగరపాలక సంస్థ తరపున ఎన్నో చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కొన్నిచోట్ల స్థానికుల నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యంతో ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. డ్రైనేజీలలో చెత్త పేరుకుపోవడం వల్ల మురికినీటి పారుదలకు ఆటంకంగా మారుతోందని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు, పారిశుద్ధ్య విభాగం మధ్య సమన్వయం ఉన్నప్పుడే మరిన్ని మంచి సేవలు అందించగలమన్నారు. ప్రజలు తడి పొడి చెత్తను వేరువేరుగా విభజించి మాత్రమే అందజేయాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రెడ్డి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వాజ్‌పేయికి ఘనంగా నివాళి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: జాతీయ రహదారులను మెరుగుపరచిన దార్శనికుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. బీజేపీ దక్షిణ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రంగయ్యనాయుడు వీధిలో వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అట్టడుగు బడుగు బలహీన వర్గాల మహిళల కోసం 35 కేజీల బియ్యాన్ని అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నదులు అనుసంధానం చేసినది ఆయన హయాంలోనే అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి వై.మాలకొండయ్య, యువమోర్చా ప్రధాన కార్యదర్శి దొడ్డి వీరేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

పరిపాలనా దక్షుడు వాజ్‌పేయి

కాకినాడ రూరల్: దేశం కోసం, దేశ సౌభ్రాతృత్వం కోసం ఎంతో ఉన్నతస్థాయి పరిపాలన మనకు అందించిన మహోన్నత వ్యక్తి అజాతశత్రువు దివంగత ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటికూరి సూర్యనారాయణ రాజు కొనియాడారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు, మీడియా ప్రతినిధి ఎనిమిరెడ్డి మాలకొండయ్య, మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ముత్తా నవీన్‌కృష్ణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వాజ్‌పేయి దేశం కోసం తీసుకువచ్చిన సంస్కరణలను వివరించారు. ఉత్తర మండల అధ్యక్షుడు యార్లగడ్డ వెంకట్రాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు పితాని లీలావతి, పార్టీ నాయకులు కవికొండల భీమ శేఖర్, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు అనపర్తి వెంకటేష్, జిల్లా కార్యదర్శి పక్కి మణిబాల, రూరల్ మండల అధ్యక్షుడు నందూరి సత్తిబాబు, ముమ్మిడి సూర్యకళ, కేతినీడి విజయరామయ్య, రఘు బాబు రాయుడు, శ్రీనివాస్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్యసేవలు

కాకినాడ: కాకినాడ దుమ్ములపేటలోని మస్తరు కేంద్రంలో పారిశుధ్య కార్మికుల కోసం బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విశ్రాంత జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లికార్జున్ వైద్య శిబిరంలో పాల్గొని సేవలు అందించారు. బీపీ, రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. లైఫ్ వే ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వై.శ్రీనివాస్, డాక్టర్ ఎం.వి జయ్‌కుమార్, డాక్టర్ నారాయణసింగ్ తోడ్పాటునందించారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్ సూచన మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వల్లూరి లాజర్, ఇతర సిబ్బంది శిబిరంలో సహకరించారు.



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ మల్లికార్జున్

వంతెన వెతలు ఎన్నాళ్లు?

- నత్తనడకన అరట్లకట్ట వంతెన నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, రైతులు



అరట్లకట్ట వద్ద ఇరుకుగా వేసిన డైవర్షన్ రోడ్డు



అరట్లకట్టలో నిర్మాణంలో ఉన్న వంతెన

కరప: అరట్లకట్ట వంతెన నిర్మాణం నత్తనడకన సాగుతుండడంతో మూడు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు మొదలుపెట్టి ఏడాది కావస్తున్నా పనులు పూర్తికాక పోవడంపైనా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిధులు మంజూరు చేయించినా అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరిపై నిరసన వ్యక్తమవుతోంది. కరప, పెదపూడి, కాకినాడ రూరల్ మండలాలను కొవ్వూరు కాలువపై ఉండే అరట్లకట్ట వంతెన అనుసంధానం చేస్తుంది. మండల పరిధిలోని కొరుపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట గ్రామస్తులు పెదపూడి, రూరల్ మండలాలు వెళ్లేందుకు ఈ వంతెన దగ్గరదారి. శిథిలమైన ఈ వంతెన పడగొట్టి గతేడాది పునర్నిర్మాణ పనులు చేపట్టారు. వంతెన నిర్మాణంలో భాగంగా ప్రజలు రాకపోకలు సాగించేందుకు పంటకాలువపై తాత్కాలికంగా కాలిబాట వేశారు. ఈ కాలిబాటకు రైతులు అభ్యంతరం చెప్పడంతో, అప్రోచ్‌రోడ్డు నిర్మిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ మాట ఇచ్చారు. నేటికీ అప్రోచ్ వెడల్పు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి ప్రవాహం వల్లే జాప్యం

కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందువల్లే పనుల్లో జాప్యం అవుతోంది. వంతెన శ్లాబ్ వేశాం. రిటర్నింగ్ వాల్స్ నిర్మించి మట్టితో పూరిస్తే సరిపోతుంది. పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– వర్మ, డీఈఈ

రైతులకు ఇబ్బంది



పాత వంతెన పడకొట్టిన తర్వాత డైవర్షన్ రోడ్డు వెడల్పుగా వేయకపోవడం వల్ల రెండెడ్ల బండ్లు, ట్రాక్టర్లు వెళ్లలేక చాలా ఇబ్బందిగా ఉంటోంది. వంతెన పని పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సోదగం సూరిబాబు, అరట్లకట్ట

అవసరం మేరకే రసాయనిక మందులు

- రైతులకు ఎంఏఓ రాజేష్ అవగాహన
- కొరిపల్లిలో వైఎస్సార్ పొలంబడి

కరప: పొలాల్లో శత్రు, మిత్ర పురుగులు ఉంటాయని, శత్రు పురుగుల ఉనికి ఎక్కువగా ఉంటేనే రసాయనిక మందులు వినియోగించాలని ఎంఏఓ ఏవీ రాజేష్ తెలిపారు. కొరిపల్లిలో బుధవారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించి, రైతులకు సూచనలిచ్చారు. పొలంబడి రైతులను చేలల్లోకి తీసుకువెళ్లి శత్రు, మిత్ర పురుగుల గురించి వివరించి, ఏయే పురుగుల వల్ల పంట తెగుళ్లు, చీడ పీడలు ఆశిస్తాయో తెలిపి, నివారణ చర్యలపై ఆయన అవగాహన కల్పించారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుండటంతో వేడి వాతావరణానికి కొన్ని ప్రాంతాలలో అక్కడక్కడ సార్వా వరిపంటపై అగ్గి తెగులు ఆశిస్తోందని, రైతులు అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వరిమూనల సుతలు ఎండిపోయినట్టు కనబడతాయన్నారు. అగ్గితెగులు నివారణకు సూడోమోనస్ మందు 500 గ్రాములు ఒక ఎకరాకు పిచికారీ చేయాలని ఎంఏఓ సూచించారు. లిక్విడ్‌లో ఉండే ఇఫ్కో కంపెనీ నానో యూరియా, నానో డీఏపీ గురించి వివరించి, వీటిని వినియోగించడం వల్ల పెట్టుబడులు తగ్గించుకోవచ్చన్నారు. గ్రామ సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఆర్‌వీవీ సత్యనారాయణ, వీఏఏ ఎస్.స్వర్ణ తేజ్, ఏఈఓ ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.



కొరిపల్లి పొలంబడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంఏఓ రాజేష్